ప్రజాశక్తి

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 8 పేజీలు




గుంటూరు పల్నాడు

3 కేటగిరీలుగా సచివాలయాలు

పట్టణాల్లో భారీగా తగ్గనున్న సంఖ్య - సిబ్బంది సర్దుబాటుకు ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో సమూల మార్పులో భాగంగా ప్రభుత్వం మొత్తం సచివాయాలను మూడు కేటగిరిలుగా విభజిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయాల్లో పనిచేసే వివిధ శాఖల ఉద్యోగులను సర్దుబాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 2500 జనాభా ఉన్న సచివాలయాలకు ఇద్దరు, 2501 నుంచి 3500 జనాభా వరకు ఉన్న సచివాలయాలకు ముగ్గురు సిబ్బందిని, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు నలుగురు సిబ్బందిని కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు వీలుగా రియల్ టైమ్ పౌర సేవలు అందించేందుకు సిబ్బందికి విధులు కేటాయించనున్నట్టు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత



సచివాయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసులను ఉంచనున్నారు. మిగతా వారిని శాఖల వారీగా సర్దుబాటు చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో అడ్మిన్ కార్యదర్శితో పాటు నలుగురే ఉంటారని తెలుస్తోంది.

2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత గుంటూరు జిల్లాలో మొత్తం 11,26,164 మంది జనాభా ఉండగా 568 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం రూపొందించిన జాబితాల ప్రకారం 2501 జనాభాకు ఒక్క సచివాలయం ఉండాలనే నిబంధన ప్రకారం దాదాపు 250 గ్రామ పంచాయతీల్లో ఒక్కటే సచివాలయం ఉండనుంది. గుంటూరులో 206 సచివాలయాలకు గాను 106కి కుదించాలని ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్‌తో జిల్లాలో కొత్త నియామాకాలను చేపట్టకుండా ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. ఇతర పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా సచివాలయల సంఖ్యను దాదాపు 30 శాతం వరకు తగ్గించనున్నారు. ▶ 2లో

మిర్చి రైతులకు వ్యాపారుల టోకరా

రూ.70 లక్షలు ఎగవేత, ఆపై బెదిరింపులు - డిఆర్‌ఒకు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు


కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

మా వద్ద మిర్చి కొనుగోలు చేసి, డబ్బులివ్వకుండా మోసం చేసిన గుంటూరుకు చెందిన వ్యాపారులపై చర్యలు తీసుకొని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం, గ్రంధసిరి గ్రామానికి చెందిన రైతులు డిఆర్‌ఒకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2024లో తమ గ్రామంలోని ఐదుగురు రైతులం రూ.70.20 లక్షల మిర్చిని గుంటూరులోని విజయ్‌భాస్కర్ ట్రేడర్స్ కమిషన్ కొట్టుకు చెందిన గోపు శ్రీనివాసరెడ్డి, సంగిలి కిషోర్‌రెడ్డికి విక్రయించామన్నారు. కోటపాటి రామకోటేశ్వరరావు 80 క్వింటాళ్లు (రూ.13 లక్షలు), పరుచూరి ప్రతాప్ 75 క్వింటాళ్లు (రూ.12 లక్షలు), కిలారి నాగేశ్వరరావు 90 క్వింటాళ్లు (రూ.14.20 లక్షలు), కోటపాటి నాగేశ్వరరావు 96 క్వింటాళ్లు (రూ.15 లక్షలు), కోటపాటి నరసింహారావు 100 క్వింటాళ్లు (రూ.16 లక్షలు) సరుకు విక్రయించామని వివరించారు. ▶ 2లో


మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

8 లో

ఐకానిక్ ఫ్లైఓవర్ కోసం ఐక్యంగా ఉద్యమం

బెటర్ శంకర్ విలాస్ బ్రిడ్జి సాధన జెఏసి ఆధ్వర్యంలో మానవహారం



నిరసనలో ముస్లిమ్ మహిళలు

5 లో

రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టం


మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్.. వెనుక ముసుగులో నిందితుడు

అసభ్య పోస్టింగ్స్‌పై చర్యలు తప్పవు

భారతీపై అసభ్య వ్యాఖ్యలు చేసిన ఐ టిడిపి కార్యకర్త అరెస్టు


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టింగ్స్ పెట్టినా, వాటిని ఫార్వార్డ్ చేసినా చర్యలు తప్పవని గుంటూరు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ హెచ్చరించారు. మాజీ సిఎం వైఎస్ జగన్ భార్య భారతీపై అసభ్య వ్యాఖ్యలు చేసిన టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను అరెస్టు చేసి గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం సాయంత్రం మీడియా ఎదుట ముందు హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కిరణ్‌పై మొత్తం నాలుగు కేసులు ఉన్నాయన్నారు. గుంటూరు నగరానికి చెందిన చేబ్రోలు కిరణ్ కుమార్ రామన్నపేటలో నివాసం ఉంటూ టిడిపిలో ఐటి విభాగంలో పనిచేస్తున్నాడని, ▶ 2లో

20, 21 తేదీల్లో రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభ ఈనెల 20, 21 తేదీల్లో ఎన్‌టిఆర్ జిల్లా, కొండపల్లిలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కోశాధికారి వి.వెంకటేశ్వరరావు తెలిపారు. మహాసభ కరపత్రాలను స్థానిక కృష్ణనగర్ పార్క్ వద్ద సంఘ నాయకులు గురువారం ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 20న మధ్యాహ్నం 3 గంటలకు కొండపల్లి పోస్టాఫీసు సెంటర్ నుండి ప్రదర్శన, అనంతరం విటిపిఎస్ వారి బి కాలనీ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. బహిరంగ సభలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య, ఆహ్వాన సంఘ కమిటీ అధ్యక్షులు సిహెచ్.వెంకటరెడ్డయ్య, గౌరవాధ్యక్షులు బి.శ్రీకాంత్ ప్రసంగిస్తారని తెలిపారు. ర్యాలీ, బహిరంగ సభలో రజక వృత్తిదారులు పెద్ద ▶ 2లో

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు




పాలడుగు గ్రామంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సాయం : పురందేశ్వరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 'గావ్ చలో అభియాన్' (పల్లెకు పోదాం చలో) కార్యక్రమంలో భాగంగా మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి గురువారం వచ్చిన ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నిధులు కేటాయిస్తోందని, కొత్త రైల్వే లైన్లకు, జాతీయ రహదారులు, అమరావతి నుంచి ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేసే ఎక్స్‌ప్రెస్ హైవే రహదారులు అనుమతి ఇస్తోందని చెప్పారు. రాజధాని నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాల సాయం చేస్తుందన్నారు. పోలీసులపై మాజీ సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, నాయకులు బాషా, బి.శివన్నారాయణ, ఎ.వెంకటరమణ, వైవి సుబ్బారావు పాల్గొన్నారు.

డిఎస్‌పిల బదిలీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో పలువురు డిఎస్‌పిలు బదిలీ కాగా ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్త వారిని నియమిస్తూ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు మహిళా డిఎస్‌పిగా ఉన్న బి.వి.సుబ్బారావును రాజమండ్రికి బదిలీ చేశారు.విఆర్ లో ఉన్న పి.మల్లిఖార్జునరావును విజిలెన్సుకు విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు. వి.వి.రమణకుమార్ ప్రకాశం జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌కు, డి.శ్రీనివాసరెడ్డిని గుంటూరు మహిళా డిఎస్‌పిగా ఉన్న నియమించారు. విఆర్‌లో ఉన్న మోహన్‌ను సిఐడి విభాగానికి బదిలీ చేశారు.



రక్తదానం చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, సర్వేయర్లు

భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ ముఖ్యపాత్ర

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే ఉద్యోగుల యూనియన్ బిల్డింగ్‌లో గురువారం జాతీయ సర్వే దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, ఏడి సర్వే పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సర్వేయర్లతో పాటు కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, ఆర్‌డిఓ శ్రీనివాసరావు రక్తదానం చేశారు. మొత్తం 53 మండి ఉద్యోగులు అందించిన రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు భూమి అనేది ఒక భావోద్వేగమైన అంశం అన్నారు. భూ పరిపాలనకు సంబంధించి భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ ప్రముఖ పాత్ర వహిస్తుందని కొనియాడారు. గతేడాది బాగా పనిచేసిన సర్వేయర్లకు ఇంచార్జ్ కలెక్టర్ ఏ.భార్గవతేజ ప్రశంస పత్రాలు అందించారు.

బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద అవసరమైన విస్తరణ, మరమ్మతు, ఇండికేషన్ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో భార్గవతేజ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలసి జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలకు అవకాశం ఉన్న 19 ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్‌లను జాయింట్ పరిశీలన కమిటీ గుర్తించిందని, వారి సిఫార్సులు మేరకు అవసరమైన పనులు వెంటనే చేపట్టాలన్నారు. జాతీయ రహదారి విస్తరణ పెండింగ్ ఉన్న ఖాజా, పెద కాకాని వద్ద భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఖాజావలి, అడిషినల్ ఎస్‌పి రమణమూర్తి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషణ్ పఖ్వాడా ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ..

పిల్లలు, మహిళల్లో ఆరోగ్యకరమైన, పోషకాహారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏప్రిల్ 8వ తేది నుంచి 22 వరకు నిర్వహిస్తున్న పోషణ్ పఖ్వాడా కార్యక్రమాలు ఐసీడీఏస్ అధికారులు సక్రమంగా అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్‌తో కలసి పోషణ్ పఖ్వాడా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

జగన్‌పై కేంద్ర హోం మంత్రికి ఎంపీ లేఖ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శాంతి భద్రతలకు ముప్పుగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మారుతున్నారని, పర్యటనల పేరుతో విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఎంపీ లేఖ రాశారు. జగన్ వ్యాఖ్యలు పోలీసుల నైతికతను దెబ్బతీసేలా ఉన్నాయని, బెయిల్‌పై ఉన్న ఆయన వ్యవస్థలను బెదిరించేలా వ్యవహరిస్తూ బెయిల్ షరతులను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి సమన్వయంతో కృషి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాను మాదకద్రవ్యాల వినియోగ రహితంగా తీర్చిదిద్దటానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన, ఎన్‌ఫోర్స్‌మెంట్, కమ్యూనిటీ విజిలెన్స్ కార్యక్రమాలు అమలు చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.భార్గవతేజ ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో ఇంచార్జ్ కలెక్టర్ భార్గవతేజ, ఎస్పీ సతీష్ కుమార్, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలసి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. నిషేదిత మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై సమస్యాత్మక ప్రాంతాల్లోను, విద్యాసంస్థల్లోను పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోను పోలీస్, పంచాయితీ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతోను ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల నిషేదిత మాదక ద్రవ్యాలను అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి విచారించినప్పుడు ఉన్నత విద్యాసంస్థల్లోని విధ్యార్థులకు అమ్మటానికే వీటిని తీసుకు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఉన్నత విద్యాసంస్థలు ముఖ్యంగా యూనివర్సిటీలలో విద్యను అభ్యసిస్తున్న ఇతర ప్రాంతాల విద్యార్థులు కళాశాల హాస్టల్స్‌లో కాకుండా సొంతగా, ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్న వారి వివరాలను అందిస్తే పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేయటం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే సంబంధిత పోలీసు శాఖ కు తెలియచేయాలన్నారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనార్థాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిఆర్ఒ ఖాజావలి, అడిషనల్ ఎస్పీ జి.వి.రమణమూర్తి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వార్షిక తనిఖీల్లో భాగంగా పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ మండల కేంద్రం రొంపిచర్ల 33/11 కెవి రొంపిచర్ల, సుబ్బయ్య పాలెం సబ్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ చౌర్యం జరగకుండా సిబ్బంది తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. 100 శాతం విద్యుత్ బిలవసూలు చేయాలన్నారు.నూతన సర్వీసుల ను మంజూరు చేయాలన్నారు. 50శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు జూన్ 30 వరకు అవకాశం ఉందన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించా లన్నారు. నరసరావుపేట రూరల్ డిఈఈ వెంకటేశ్వర రెడ్డి, రొంపిచర్ల ఏఈఈ కె రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్య పోస్టింగ్స్‌పై చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

అసభ్యకరమైన వ్యాఖ్యాలు చేశాడని అన్నారు. దీనిపై మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామానికి చెందిన బంగు వెంకట కృష్ణారెడ్డి, సంగేవు వెంకట శివరామకృష్ణ మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ పారిపోతున్న చేబ్రోలు కిరణ్ కుమార్‌ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇబ్రహీంపట్నం సమీపంలోని కీలేసపురం వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. మాజీ మంత్రి విడదల రజని, పలువురు వైసిపి నాయకులపై అనుచిత పోస్టింగ్‌లు పెట్టినందుకు వివిధ ప్రాంతాల్లో కిరణ్‌పై కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నార్త్ డిఎస్‌పి మురళీకృష్ణ, మంగళగిరి రూరల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పాల్గొన్నారు.

మిర్చి రైతులకు వ్యాపారుల టోకరా

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి నుండి డబ్బులు ఇవ్వకుండా రేపుమాపు అని తిప్పుకుంటూ నమ్మించి మోసం చేశారన్నారు. మోసపోయామని గ్రహించి, అందరం వెళ్లి అడగగా మాపై రౌడీలతో దాడి చేయించి, కర్రలతో కొట్టించారన్నారు. అంతేకాకుండా వీరికి అండగా జంగా నర్సిరెడ్డి, రామిరెడ్డి, వారి కొట్లో పనిచేసే గుమస్తాలైన శ్రీనివాసరావు, ఆళ్ల రామిరెడ్డి, వారి గ్రామానికి చెందిన షుమారు 20 మందిని తీసుకొచ్చి మాపై దాడి చేయించారని అన్నారు. అనేక సార్లు వెళ్లి అడగినా మొహం చాటేశారన్నారు. పోలీసు కేసు పెడతామని చెప్పినా దిక్కున్నచోట చెప్పుకోవాలని, అసభ్యకరంగా దూషించారని చెప్పారు.

3 కేటగిరీలుగా సచివాలయాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా గుంటూరుతో పాటు అన్ని మున్సిపాల్టీల్లో దాదాపు 40 నుంచి 50 శాతం వరకు తగ్గనున్నాయి. 2020లో దాదాపు 14 వేల మంది ఉద్యోగులు నియమితులయ్యారు. వీరిలో దాదాపు నాలుగు వేల మంది వేర్వేరు ఉద్యోగాలకు వెళ్లిపోయారు. మరికొంత మంది దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. ఇప్పటి వరకు గ్రామ సచివాయాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో 10 మంది ఉద్యోగులను గత ప్రభుత్వం కొనసాగించింది. మొత్తం 35 శాఖల పరిధిలో 540 రకాల సేవలు అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల వ్యవస్థపై సమీక్ష చేసి పట్టణాలు, నగర ప్రాంతాల్లో 8 వేల మందికి ఒక సచివాలయం ఉండాలని, పెద్ద గ్రామాల్లో 5000 మందికి ఒక సచివాలయం ఉండాలని ప్రతిపాదించారు. ప్రతి పంచాయతీలో సగటున ఒక సచివాలయం కొనసాగిస్తారు. మొత్తం ఎ, బి, సి కేటగిరిలో విభజించి ప్రస్తుతం ఉన్న సిబ్బందిని కుదించి మిగతా వారిని శాఖల వారీగా సర్దుభాటు చేయనున్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేసే వారికి కనీసం జూనియర్ ఇంజినీర్ స్థాయి హోదా ఇచ్చి వివిధ శాఖలలో ఖాళీగాఉన్న పోస్టులలో నియమించి జెఈ లేదా ఎఈ స్కేలు వర్తింపజేయాలని బీటెక్, బిఈ, ఎంటెక్ అర్హత కలిగిన వారు కోరుతున్నారు. అయితే మున్సిపాల్టీల పరిధిలో పనిచేసే బిఎస్‌సి అర్హత కలిగిన శానిటరీ అసిస్టెంట్‌లు తమకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలని కోరుతున్నారు. రేషనలైజేషన్ ద్వారా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్‌గా వీరిని విభజించాలనేది ప్రతిపాదన అనుగుణంగా మార్పులు చేయనున్నారు.

20, 21 తేదీల్లో రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బహిరంగ సభ అనంతరం 21న ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లోని ముత్తవరపు స్వర్ణాదేవి వెంకటేశ్వరావు ఆడిటోరియంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ప్రతినిధులతో సభ ఉంటుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుబ్బారావు తెలిపారు. రజకవృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సభలో సమగ్రంగా చర్చించుకొని భవిష్యత్ కర్తవ్యాలు నిర్దేశించుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటనరసయ్య, జిల్లా కోశాధికారి వి.చిన్న కొండయ్య, సీతయ్య, ఎస్.శ్రీనివాసరావు, భాస్కరరావు, ఎల్.శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. గుంటూరు డివిజన్-1 అధ్యక్షులుగా ఎస్ఎస్-ఎస్ ప్రసాద్, కార్యదర్శిగా ఆరిఫ్ ఎన్నికయ్యారు. అలాగే గుంటూరు-2 డివిజన్ అధ్యక్షులుగా ఎ.ఎస్.సోమశేఖర్, కార్యదర్శిగా ఎన్‌జె కిరణ్మయి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెండు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు, కార్యవర్గ సభ్యులతో గురువారం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జిఎం రమేష్ కూమార్ ప్రమాణ స్వీకారం చేయించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ

పాఠశాలకు జిఎస్‌టి కమిషనర్ సాయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంపై సానుకూల ప్రభావం చూపించడానికి కస్టమ్స్, జిఎస్‌టి శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఆ శాఖ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఉదయం గుజ్జనగుండ్ల లోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలకు కస్టమ్స్, జిఎస్‌టి కమిషనర్ నరసింహారెడ్డి సందర్శించి పాఠశాల అభివృద్ధికి సహకారం అందించారు. పాఠశాల భవనానికి పెయింటింగ్‌కు అయ్యే ఖర్చును నగదు రూపంలో అందచేశారు. పాఠశాలకు ఐరన్ బీరువా, స్టాఫ్ టేబుల్స్, ఇరవై కుర్చీలను బహుకరించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు అన్నీ సౌకర్యాలను కల్పించటంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. విద్యతో పాటు మౌలిక సౌకర్యాలలో కూడా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దటానికి సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న కషికి ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా భావించి, సహకారం అందించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ నిధుల ద్వారా కస్టమ్స్, జీఎస్టీ కమిషనరేట్లు ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవటానికి తమ శాఖ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాలలోని సౌకర్యాలు పరిశీలించి భవిష్యత్ లో అండగా నిలుస్తామన్నారు. పధానోపాధ్యాయులు బి. నరసింహారావు, అధ్యాపకులు ఎం.భాస్కరరావు, కె.సుధారాణి జిఎస్‌టి అధికారులు చీదేళ్ళ ఈశ్వరరావు, వరకుమార్, సాధిక్ ఆలీ, పూర్ణ సాయి, కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల మాధవ్ రౌడీయిజం తగదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసులపై జులం ప్రదర్శిస్తున్న వైసిపి మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర డిమాండ్ చేశారు. గురువారం రాత్రి ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ పోలీసుల అదుపులో ఉన్న ఐటిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై మాధవ్ దాడికి దిగడం దారుణం అన్నారు. వైసిపి సానుభూతిపరుల సమాచారంతో నే మాధవ్ మంగళగిరి నుంచి గుంటూరు వరకు పోలీసుల వాహనాన్ని అనుసరించి గుంటూరులో కిరణ్‌పై దాడి చేశారన్నారు. చేబ్రోలు కిరణ్ జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కూటమి ప్రభుత్వమే స్పందించి చట్టపరంగా కిరణ్‌ను శిక్షించేందుకు అరెస్టు చేసి చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు. పోలీస్ కస్టడీలో కిరణ్ పై దాడికి పూనుకోవటానికి గోరంట్ల మాధవ్ చేసిన దుస్సాహసం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు. చేబ్రోలు కిరణ్ ను అరెస్టు చేసిన తదనంతరం కిరణ్ తరలించే మార్గాలు ప్రాంతాలు గోరంట్ల మాధవకు ఎలా తెలిసాయని ముందస్తు పథకం ప్రకారమే గోరంట్ల మాధవ్ కస్టడీలో ఉన్న కిరణ్ పై దాడికి పాల్పడ్డాడని తెలిపారు. పోలీసులు సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే పోలీస్ కస్టడీలో కిరణ్ పై జరిగిన దాడి పోలీసుల వైఫల్యమేనని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు.

మే డేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఈ సంవత్సరం మే ఒకటో తేదీన కార్మికుల దినమైన మేడేను ఘనంగా నిర్వహించాలని సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం రాత్రి మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఎయిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ విస్తత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు కే బుజ్జి బాబు అధ్యక్ష వహించారు. రమేష్ మాట్లాడుతూ ఎయిమ్స్ లో కార్మికులంతా ఒకటిగా ఉండి వేతనాలు పెంచుకోవడం జరిగిందని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మికుల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడానికి కషి చేయాలని కోరారు. కార్మిక వర్గం ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాల రాసిందని విమర్శించారు. కార్మిక హక్కుల కొరకు సంఘటితంగా కార్మిక వర్గం ఉండి సాధించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ సిఐటియు నాయకులు జెవి రాఘవులు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, యూనియన్ నాయకులు జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు రమేష్

మంత్రి లోకేష్ సహకారంతో చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన అబ్దుల్ జానీ, నల్లమోతుల మాధవి, మంగళగిరి పట్టణానికి చెందిన చింతలపూడి దుర్గ, తాడేపల్లి పట్టణానికి చెందిన షేక్ సాహిల్‌కు గురువారం టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు. అద్దె బళ్ళు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నామని తమకు బండ్లు అందజేయాలని చిరువ్యాపారులు మంత్రి నారా లోకేష్‌ని కోరగా స్పందించిన ఆయన స్థానిక నాయకుల చేతుల మీదుగా టిఫిన్ బండ్లు అందజేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ తమకాళ్ల మీద తాము నిలబడుతూ ఉపాధి పొందుతున్న బడుగుజీవులకు మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వివిధ రకాల విలువైన బండ్లను తయారు చేయించి అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మంగళగిరి మండల ప్రధాన మల్లవరపు వెంకట్, నవులూరు గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు, నాయకులు బిట్రా దుర్గారావు, గోవాడ రవి, తోట శ్రీనుబాబు, కొల్లి వెంకట్రావు, బత్తుల నాగరాజు, తోట సాంబయ్య, రుద్రు శ్రీనివాసరావు, చిలకలపూడి శేషగిరి, జాన్‌బాబు, కొత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రంలోని హెచ్‌పి పెట్రోల్ పంపు సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న పెద్దిబోయిన బాలయ్యను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. అమరావతి నుంచి ఎండ్రాయి తన బైక్‌పై వెళుతుండగా ఎండ తీవ్రతకు కళ్లు తిరిగి కిందపడిపోయాడు. వెనక వైపుగా వస్తున్న ఆర్టీసీ బస్సు తాకడంతో గాయాలపాలవగా స్థానికులు అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

నాటుసారా కట్టడికి విస్తృత దాడులు

ఎక్సైజ్ సిఐ వెంకటరమణ

ప్రజాశక్తి -మాచర్ల

మాచర్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మండలాల్లో ప్రత్యేక బృందాల తో నాటు సార కట్టడి కోసం విస్తృత దాడులు జురుపుతున్నట్లు ఎక్సైజ్ సిఐ వెంకట రమణ అన్నారు. గురువారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవోదయం ప్రోగ్రామ్ ద్వారా గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామస్థులను చైతన్యపర్చటం, నాటు సారా వలన జరిగే నష్టాలను వివరిస్తున్నట్లు తెలిపారు. మార్చి నుండి మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవోదయ ప్రోగ్రామ్‌ను పెద్దఎత్తున జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన దాడుల్లో 7వేల లీటర్ల బెల్లం వూటను ధ్వంసం చేసామని, 100 లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు తెలిపారు. 14 కేసులు నమోదు చేసి, 7గురిని ఆరెస్టు చేసినట్లు తెలిపారు. నాటు సారాను పూర్తిగా నిర్మూలించేందుకు ఆయా గ్రామాల్లోని ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

కోడి పందేలు వేస్తున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లి

నులకపేటలో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు ఆదేశాలతో ఎస్ఐ ఖాజావలి, సిబ్బంది దాడులు చేశారు. రెండు కోళ్లు, 8 మంది జూదరులు, 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా నేత్రాలు ఉంటాయన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వివరాలు తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా వ్యవసాయ కూలీ మృతి

ప్రజాశక్తి - మాచర్ల :

ఉదయాన్నే పనికి వెళుతున్న మహిళా వ్యవ సాయ కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన గురువారం పట్టణం లోని రింగ్‌రోడ్డు సెంటర్లో జరిగింది. పట్టణానికి చెందిన వ్యవసాయ కూలి షేక్ ఖాదర్‌బి (55) కూలీ పనికి వెళ్ళేందుకు స్థానిక రింగ్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో అటుగా వస్తున్న టాటా మ్యాక్సీ ఢీకొట్టింది. దాంతో ఖాదర్ బీ తలకు తీవ్ర గాయమైంది. ఖాదర్‌బిని హుటాహుటిగా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఖాదర్‌బి మృతి చెందింది. ఆమె అవివాహిత. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.



షేక్ ఖాదర్‌బీ (ఫైల్)

టిప్పర్ ఢీ కొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

ట్రిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని బొమ్మరాజు పల్లి కనుమ మూలమలుపు వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ముప్పాళ్ళ మరియ బాబు పొగాకు కంపెనీ సూపర్వైజర్ గా పనిచేస్తూ విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై జయంతి రామపురం వెళ్తుండగా కారంపూడి నుండి విను కొండ వైపు వెళ్తున్న ట్రిప్పర్ లారీ బొమ్మరాజుపల్లి కనుమ వద్ద వేగంగా ఢీకొట్టడంతో మరియబాబు తలకు, చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి అన్న ముప్పాళ్ళ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు సాంస్కృతిక, సాహిత్య పోటీలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ కళాశాలల వార్షికోత్సవాల సందర్భంగా ఈనెల 9, 10 తేదీలలో విద్యార్థులకు సాంస్కృతిక మరియు సాహిత్య పోటీలను నిర్వహించినట్లు వార్షికోత్సవ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం త్రిమూర్తి రావు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ , నాటిక, నత్యం, మోనో యాక్షన్, స్పాట్ పెయింటింగ్ వంటి పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 17వ తేదీన జరిగే వార్షికోత్సవ వేడుకలలో బహుమతులు అందజేస్తారని చెప్పారు. పోటీల నిర్వహణకు కమిటీ సభ్యులుగా ఆచార్య ఎస్ మురళీమోహన్, డాక్టర్ ఎం వసంతరావు, డాక్టర్ మంజుల, డాక్టర్ పవన్, డాక్టర్ గీతా సోని , డాక్టర్ నిర్మల పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని విజయవాడ రోడ్‌లోని గోపాలనగర్‌లో పెద్ది బోయిన బుల్లియకు సంబం ధించిన వరిగడ్డి వామి గురువారం సాయంకాలం అగ్నికి ఆహుతైంది. పది ట్రక్కుల వరి చెత్త కొను గోలు చేసి తమ నివాసాల మధ్య ఖాళీ స్థలంలో భద్రపరిచారు. మధ్యాహ్నం సమయంలో చిన్నారు లు ఆటలాడుతూ అగ్గి వేయడంతో ఈ ప్రమాదా నికి కారణమైందని స్థానికులు తెలిపారు. సుమారు రూ. 2.5 లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పింది.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఐటిడిపి కార్యకర్త కిరణపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి- తాడేపల్లి

మాజీముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి పై ప్రసభ్యకరంగా పోస్టులు పెట్టిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ పై తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో గురువారం మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు ఫిర్యాదు చేశారు. చదవడానికి జిగుప్సాగరంగా ఉన్న విధంగా పోస్ట్ పెట్టిన కిరణ్ వెంటనే అరెస్ట్ చేయాలని కనకారావు కోరారు. ఫిర్యాదు స్వీకరించిన తాడేపల్లి ఎస్సై జె శ్రీనివాస్ రావు విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సోషల్ మీడియా రాష్ట్ర విభాగం ముదిగొండ ప్రకాష్ మరియు ఆ పార్టీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఉన్నారు.



సమస్యను ఎస్పీకి వివరిస్తున్న దంపతులు

బాధిత వృద్ధ దంపతుల ఇంటికి ఎస్పీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ధైర్యంగా ఉండాలని మీకు న్యాయం చేస్తానని వృద్ధ దంపతులకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు భరోసానిచ్చారు. విజయపురిసౌత్‌లో గురువారం పర్యటించిన ఎస్పీ అదే గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న అరికట్ల బ్రహ్మారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ఇటీవల ఎస్పీని ఓ సమస్యపై ఆశ్రయించడంతో వారింటికి ఎస్పీ వెళ్లారు. దంపతులు 8.5 ఎకరాల పొలంతో పాటు ఆస్తులను మొత్తం అమ్మి తమ కొడుకు అంజిరెడ్డిని ఉన్నత చదువులు చదివించగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారని, ఇప్పుడు తాము అనారోగ్యంతో బాధపతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. అనారోగ్యంతో పాటు ఆర్థిక పరిస్థితి దిగజారడంతో ఆత్మహత్యాయత్నానికీ పాల్పడినట్లు ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము మాచర్ల పోలీసులకు తమ కొడుకు పై ఫిర్యాదు చేయగా అప్పటి ఎమ్మెల్యే సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తన కొడుకుకు మద్దతుగా నిలిచి కేసు పరిష్కారం కాకుండా చేశాడన్నారు. కోర్టులో కేసు వేయగా నెలకు రూ.10 వేలు ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినా దాన్ని కూడా తమ కొడుకు ఖాతరు చేయలేదని వెస్పీకి వివరించారు. ఈ విషయంతో న్యాయం చేస్తానని ఎస్పీ హామీనిచ్చారు. ఎస్పీ వెంట మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్, రూరల్ సీఐ నఫీజ్ బాష, విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఉన్నారు.



గ్యాస్, పెట్రో ధరలపై నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రో ధరలు వెంటనే తగ్గించాలని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాష డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసిపిఐయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి ఆర్డీవో కార్యాలయం వరకు గురువారం ర్యాలీ చేసి ఆర్డీవో కె.మధులతకు వినతిపత్రం అందజేశారు. రెడ్ బాష మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ చెప్పగా ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. ముస్లిమ్ మైనార్టీలకు ద్రోహం చేస్తూ కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఎంసిపిఐయు నరసరావుపేట మండల, పట్టణ కార్యదర్శులు మస్తాన్‌వలి, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

ఎంఇఒ ప్రసాద్‌కు ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి - పెదకూరపాడు : పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు అచ్చంపేట మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. 15 ఏళ్లపాటు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయునిగా, 16 ఏళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, ఎంఇఒగా పనిచేయుచున్న ప్రసాదరావు విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని, చదువు పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చి నూరుశాతం పిల్లలు బడిలో చేరేలా కృషి చేశారని పేర్కొన్నారు. దీంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను చేసినందుకుగాను అవార్డుకు ఎంపికయ్యారని, 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పురస్కారాన్ని అందుకోనున్నారని తెలిపారు.

సాంఘిక విప్లవానికి వేదిక మాచర్ల చెన్నకేశవాలయం

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు - రేపు కళ్యాణం, 17న రథోత్సవం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

తరతరాలుగా అంటరా నితనం, వర్ణవివక్షతో అవమానాలకు గురై దేవాలయం గడప తొక్కని కడజాతుల వారు తొలిసారి ఆలయ ప్రవేశం చేసింది ఆ గుడిలోనే.. మనుషులంతా ఒక్కటేనని శతాబ్దాల క్రితమే చాపకూడు (కులమత భేదాలు లేకుండా కలిసి ఒకే పంక్తిలో చేసే భోజనాలు) అనే విప్లవాత్మక కార్యక్రమానికి వేదికగా నిలిచిన ఆ ఆలయమే మాచర్ల చెన్నకేశవాలయం. దళితుల ఆలయప్రవేశం, చాపకూడు కార్యక్రమాలు ద్వారా సర్వ మానవ సౌభ్రాతృత్వం చాటి, మాలకులంలో పుట్టిన కన్నమదాసును దత్తపుత్రునిగా స్వీకరించి వర్ణ ధర్మాలనే ఉక్కు చట్రాన్ని భేదించిన వాడు బ్రహ్మనాయుడు. మాచర్ల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్న వేళ ఆలయంపై ప్రత్యేక కథనం..

12వ శతాబ్ధం ఆరంభంలో 1103 నుండి 1182 వరకు మాచర్ల, గురజాల రాజధానులుగా పల్నాడు ప్రాంతాన్ని హైహయ వంశానికి చెందిన రాజులు పరిపాలన సాగించారు. 1140లో మంత్రిగానున్న బ్రహ్మనాయుడు మాచర్లలో చెన్నకేశవాలయం నిర్మించి ఆనాటి కుల,మత భేదాలను ఆ ఆలయం వేదికగా రూపుమాపే కృషి చేశాడు. కుల, మత, వర్ణ తేడాలు చూపకుండా కలసి వచ్చిన ప్రజలకు శ్రీచెన్నకేశవాలయంలో వీరవైష్ణవదీక్షను ఇచ్చాడు. దళితులను ఆలయ ప్రవేశం కల్పించటమే కాకుండా చాపకూడు పెట్టించాడు. గర్భగుడి పక్కనే అళ్వార్లుకు గుడి కట్టి అందులో అళ్వార్లను ప్రతిష్టించాడు. అందులో అంటరాని వారుగా పేరుబడ్డ వర్ణంలో పుట్టిన తిరుమలై ఆళ్వారు, తిరుప్పాదాళ్వారు, శూద్రులైన నమ్మాళ్వారు, తిరుమంగై ఆళ్వార్లకు





చెన్నకేశవస్వామితో సమానంగా పూజలు అందుకునేటట్లు ఏర్పాటు చేశాడు. వివిధ చెన్నకేశవస్వామి ఆలయాల్లో శూద్రులను అర్చకులుగా చేశాడు.

2 వేల ఎకరాల్లో మిగిలింది ఐదెకరాలే

చెన్నకేశవాయం ఒకప్పుడు ఎంతో సంపదగల ఆలయంగా ఉండేది. ఆలయ నిర్వహణ కోసం దాతలిచ్చిన రెండు వేల ఎకరాలకు పైగా భూములు పరాధీనమై ఐదెకరాలే మిగిలింది. హుండీల్లో కానుకలుగా రూ.9 లక్షలు, కొబ్బరికాయల వేలంలో రూ.లక్ష వస్తుండగా ఇది ఆలయ నిర్వహణ, దేవాదాయశాఖ అధికారులు, అర్చకుల వేతనాలకే సరిపోతోంది. ఉత్సవాల నిర్వహణకు చందాలు, దాతలు మీద ఆధారపడాల్సి వస్తోంది.

12న కళ్యాణం - 17న రథోత్సవం

శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఏటా చైత్ర త్రయోదశి రోజున ప్రారంభమవుతుతాయి. 11న ధ్వజారోహణ, 12న శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణం, 13న హనుమద్వాహనం, 14న శేషవాహనం, 15న గరుడ వాహనం, 16న రవిపొన్న వాహనం, 17న రథోత్సవం, 18న అశ్వవాహనం, 19న శుక వాహనం, 20న పుష్పయాగం, 21న ద్వాదశ ప్రదక్షణలు, 22న ఏకాశీతి కలశస్థాపన, 23న పవళింపుసేవ, 25న పదహారు రోజుల పండుగతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 12న జరిగే కళ్యాణోత్సవం, 17న జరిగే రాష్ట్రంలోనే అతిపెద్దదైన (ఎత్తు) కలిగిన రథోత్సవానికి రెండు తెలుగురాష్ట్రాల నుండి వేల మంది సందర్శకులు వస్తుంటారు. వీరికి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

గురువారం నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు పరిశీలించారు. ఆలయ పరిసరాలను, రథం, రథం తిరిగే బజారును పరిశీలించి ఏర్పాట్లపై ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఆలయ ఈవో పూర్ణచంద్రరావుతో మాట్లాడారు. సందర్శకులకు తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య సమస్యలు రానివ్వొద్దని చెప్పారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్, ఎస్పీని దేవాలయ కమిటి సన్మానించింది.

నరసరావుపేట ఆస్పత్రికి 75 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో తెలిపిన ఎమ్మెల్యే అరవిందబాబు
- రెండేళ్లలో వైద్యశాలగా తీర్చిదిద్దుతామని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రకటన



నూతన కమిటీని సత్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ (హెచ్‌డిఎస్) ప్రమాణ స్వీకారం ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. చైర్మన్‌గా డాక్టర్ రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సభ్యులుగా డాక్టర్ కంకణపాటి భారతి, మల్లికార్జున రావు, సుబ్బమ్మ, ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యశాలలో 200 పడకలతో నియోనేటాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థో తదితర అన్ని విభాగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నర్సింగ్ సిబ్బంది తక్కువగా ఉన్నారన్నారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నరసరావుపేట ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలను మెడికల్ కళాశాలగా తీర్చిదిద్దాలన్నారు. కార్డియో, న్యూరాలజీ, నెఫ్రాలజీ తదితర విభాగాలకు చెందిన పట్టణానికి చెందిన సూపర్ స్పెషలిస్ట్ వైద్యులను వారానికి ఒకసారి ఈ వైద్యశాల సందర్శించేలా కృషి చేస్తామని చెప్పారు. 75 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరైందని, కేంద్ర ప్రభుత్వం రూ.36 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. పల్నాడు బస్టాండ్‌లోని పాత వైద్యశాలలో 100 పడకలతో తల్లీబిడ్డల యూనిట్ ప్రారంభించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రాత్రి సమయాల్లో ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించి వివాదాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని, పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎంపీ మాట్లాడుతూ వైద్యశాలను మరో 150 పడకలతో 350 పడకల టీచింగ్ వైద్యశాలగా రాబోయే 2 ఏళ్లలో తీర్చిదిద్దుతామన్నారు. ఈ ప్రభుత్వ వైద్యశాలకు కావాల్సిన అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే తాను కేంద్ర స్థాయిలో కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ బివి రంగారావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.సురేష్ కుమార్, ఆర్‌ఎంఒలు డాక్టర్ ఏడుకొండలు, కె.దయానిధి, డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ ప్రసూన, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ కౌముది, డాక్టర్ రామేశ్వరి, డాక్టర్ నజియా, డాక్టర్ హేమశ్రీ పాల్గొన్నారు.

పున: పరిశీలనంటూ పిలుపులు.. వికలాంగులకు అవస్థలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తొలుత మంచానికే పరిమితమైన సామాజిక పింఛను పొందుతున్న వారిని, తర్వాత అంధులను, ప్రస్తుతం వికలాంగులును రీ వెరిఫికేషన్ (పున:పరిశీలన) పేరుతో గుర్తించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ ప్రక్రియలో భాగంగా వికలాంగుల ధ్రువపత్రాలు, వారి వైకల్య శాతం నిర్ధారణపై అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఉన్న వికలాంగులందర్నీ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి రప్పించి పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏదైనా సాకులతో తమ పింఛనును తొలగిస్తారేమోననే భయం లబ్ధిదారుల్లో నెలకొంది.





ధ్రువపత్రాల పరిశీలన కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చిన వికలాంగులు, వారి సహాయకులు

చిలకలూరిపేట పట్టణంలో సామాజిక పింఛను పొందేవారు 11 వేల మంది ఉండగా వీరిలో 1105 మంది వికలాంగులే. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలుత మంచానికే పరిమిమైన సామాజిక పింఛను పొందుతున్న వారి పున:పరిశీలన చేపట్టారు. అనంతరం అంధులను పరిశీలించారు. అయితే దానికి సంబంధించిన వివరాలను బహిరంగ పర్చలేదు. ప్రస్తుతం వికలాంగులను ఈనెల 9వ తేదీ నుండి 16వ తేదీ వరకూ చిలకలూరిపేటలోని ఏరియా ఆస్పత్రిలో పరిశీలనకు రావాలని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 50, సాయంత్రం 50 మంది చొప్పున రోజుకు వందమందికి చెందిన వైకల్య ధ్రువపత్రాలను పరిశీలించడంతోపాటు పరీక్షలూ చేస్తున్నారు. అయితే అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు మాత్రం చేయలేదు. వచ్చిన వారు కూర్చోవడానికి, తాగునీరు వంటివి లేకపోవడంతో లబ్ధిదార్లతోపాటు వారికి సాయంగా వచ్చిన వారూ గంటల తరబడి అవస్థలు పడుతున్నారు. 15 ఏళ్లుగా పింఛను పొందుతున్న తాను వీల్‌చైర్‌మీద ఇతరుల సాయంతో పరిశీలనకు ఉదయం పూట వచ్చానని, ఈ పని ఎప్పటికి పూర్తవుతుందోనని 68 ఏళ్ల షేక్ ఫాతిమాతో షేక్ బాజీ ఆందోళన వెలిబుచ్చారు. ఇదిలా ఉండగా పింఛన్ల భారం తగ్గించుకునేందుకు అర్హులనూ వివిధ రకాల సాకులతో అనర్హులుగా చేయొద్దని లబ్ధిదార్లు వేడుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పత్రాలను, ఇతర అంశాలను పరిశీలిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టం

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛను హరించే విధంగా ఉందని రాష్ట్ర ఆవాజ్ కమిటీ కార్యదర్శి సిష్టి అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంగళగిరి అంజుమన్- యి- హిమాయత్తులు ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరిలో శాంతియుత నిరసన ర్యాలీ జరిగింది.మంగళగిరి గౌతమ బుద్ధా రోడ్ లోని జామియా మసీద్ సెంటర్ నుండి బయలుదేరిన ర్యాలీలో ముస్లింలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మంగళగిరి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగాజమాతి ఇస్లామిక్ హింద్ జేయుసి కన్వీనర్ మహమ్మద్ యూసుఫ్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి సిష్టి, ముస్లిం యువసేన కన్వీనర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని ఆయన అన్నారు. దేశంలో బిజెపి పరిపాలన చూస్తే మైనార్టీలపై హిజాబ్ హలాల్ ఆజాద్ నవాజ్ అంటూ తీవ్రంగా దాడులు చేస్తున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. హిందువుల పరిరక్షణ పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వం క్రైస్తవుల, హిందువుల ఎండోమెంట్ యాక్ట్ పై దాడులు జరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

మంగళగిరిలో నిరసన ర్యాలీ



దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోరాటం హిందూ ముస్లింల వివాదం కాదని మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ ప్రెసిడెంట్ అల్తాఫ్, సెక్రటరీ మునీర్ సైదా రఫీ, ముస్లిం యువత అక్బర్ ఆలీ భాష తదితరులు పాల్గొన్నారు.



నిధి వసూళ్లలో పాల్గొన్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

క్యూబా సంఘీభావనిధి సేకరణకు విశేష ఆదరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

క్యూబాకు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం కాజా గ్రామంలో గురువారం సంఘీభావ నిధి వసూలు చేశారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు పాల్గని ప్రసంగించారు. అమెరికా సోషలిస్టు దేశాలైన క్యూబా పై ఆర్థిక ఆంక్షలు విధించి దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి లో అన్ని దేశాలు క్యూబా పై ఆంక్షలు ఎత్తివేయాలని నిర్ణయించినప్పటికీ అమెరికా మాత్రం హార్ధిక ఆంక్షలు కొనసాగిస్తూనే ఉన్నదని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు అమెరికాను వ్యతిరేకిస్తున్నాయన్నారు. క్యూబా దేశానికి అండగా నిలిచేందుకు వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా నిధులను వసూలు చేసి పంపాలని నిర్ణయించిందని దాన్లో భాగంగానే ఖాజా గ్రామంలో కూడా నిధులు వసూలు చేయగా ప్రజలు సాదరంగా ఆదరించారని తెలిపారు. గురువారం రూ.11650లు ప్రజలు సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు తో పాటు సింహాద్రి కోటిరెడ్డి, పాలేటి అప్పారావు, మేడా శివయ్య, శ్యామల కోటిరెడ్డి, గాదె మాధవరెడ్డి, కారుమూరు మాధవరెడ్డి, అప్పికట్ల భాస్కరరావు, బి.కోటేశ్వరి, స్వామి, దోసపాటి నరసింహారావు, బి.పేరిరెడ్డి , ఎం. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వివిఐటి కళాశాలకు విశ్వవిద్యాలయం హోదా

ఇష్టంతో విద్యనభ్యసించే వాతావరణం కల్పించడంతోనే ఇది సాధ్యమైంది
ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గల వివిఐటి కళాశాల, వివిఐటి విశ్వవిద్యాలయం (వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నో లాజికల్ యూనివర్శిటి)గా రూపాంతరం చెందిందని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందుకున్నట్లుగా వివిఐటి విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రకటించారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" ప్రకటనకు తగ్గట్టు కేవలం రెండు నెలల వ్యవధిలో ప్రభుత్వం వివిఐటి అభ్యర్ధనను పరిశీలించి యూనివర్శిటి హెూదాను కల్పించిందని అందుకుగాను ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 40 సంవత్సరాలు క్రితం ఆప్టెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రారంభమైన విద్యాసంస్థలు యూనివర్శిటీ స్థాయికి ఎదగటం, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తులో భాగం కావడం సంతోషాన్ని అందించిందని పేర్కొన్నారు. ఈసందర్భముగా వివిఐటి విశ్వవిద్యాలయం ప్రాంగణములో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశములో ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరి సూర్యదేవర బదరి ప్రసాద్, జాయింట్ సెక్రటరి మామిళ్ళపల్లి శ్రీకఅష్ణతో కలసి విశ్వవిద్యాలయం లోగో, బ్రోచర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతు ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి విశ్వవిద్యాలయంలో అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ ను ప్రారంభించి మేనేజ్ మెంట్ స్టడీస్ (ఎమ్.బి.ఎ. బి.బి.ఎ)లను అందించనున్నట్లు వివరించారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని నినాదంతో వివిఐటి సంస్థలను ఏర్పాటుచేయటం జరిగిందని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమ క్రమశిక్షణతో, విలువలతో కూడిన ఉత్తమ విద్యను అందించడం మాలక్ష్యం అని ఆయన తెలిపారు. కళాశాల ఉన్నతిలో, ప్రణాళికలలో, కార్యక్రమాలలో విద్యార్థులు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భాగస్వామ్యంతో మెరుగైన ఫలితాలను సాధించామని అన్నారు. ప్రతిభగల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యను అందిస్తామన్న హామి ఇచ్చారు. అడ్మిషన్స్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ వివిఐటి యూనివర్శిటీలో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష వ్రాయవలసి ఉంటుందని ఏప్రియల్ 24వ తేదీన ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఫలితాల ప్రామాణికంగా ప్రవేశాలు, స్కాలరషిప్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లిఖార్జునరెడ్డి. విబాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



తుళ్లూరులో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

రాజధాని గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ ఉన్న జీతాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం రాజధాని గ్రామాలైన తుళ్లూరు ,వెలగపూడి, అనంతవరంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. మేరకు రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి గురువారం తుళ్లూరులో ఒక ప్రకటన విడుదల చేశారు.గత పది రోజుల నుండి పారిశుధ్య కార్మికులు రోడ్డున పడి ఆకలి కేకలు వేస్తున్నా అధికార యంత్రంగానికి దున్నపోతు మీద వర్షం పడ్డట్టుగా ఉండు తప్ప, జీతాలు చెల్లించేందుకు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. పదేపదే అధికారులకు జీతాలు చెల్లించమని అర్జీలు అందజేసి కార్మికులు మొరపెట్టుకుంటున్నా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉన్నది తప్ప జీతాలు చెల్లించేందుకు మాత్రం అధికారులకు,ఏజెన్సీకి చేతులు రావడంలేదని అన్నారు.ఇంకెన్నాళ్లు పారిశుధ్య కార్మికులు జీతాలు రాక ఆకలితో కడుపులు కాల్చుకోవాలని ప్రశ్నించారు. అప్పులు కూడా దక్కని పరిస్థితుల్లో అర్ధాకలితో ఉంటూ రాజధాని గ్రామాల ప్రజల ఆరోగ్యం కోసం ,పర్యావరణం కోసం పారిశుద్ధ్య కార్మికులు పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తూ ఉంటే, వారి సమస్యల పట్ల ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం ఏమాత్రం సరైనది కాదని అన్నారు. తక్షణం పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోతే విజయవాడలో రాజధాని పారిశుధ్య కార్మికుల భిక్షాటన కార్యక్రమాన్ని చేపడతామని రవి హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు చెరుకూరు సుశీల, సుఖవేణి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషే సంస్కృతి పరిరక్షణకు మూలాధారం

- అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్
- కెఎల్‌యులో ప్రారంభమైన తెలుగు భాష అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఏ ప్రాంత సంస్కఅతి పరిరక్షింపబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షింపబడాలని, మాతఅభాషలు మాతృభాషలు కాకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని మాజీ శాసన సభాపతి, తెలుగు భాషా సంఘం మాజీ అధ్యక్షులు, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం కె.ఎల్. విశ్వవిద్యాలయం బి.ఏ.(ఐ.ఏ.ఎస్) విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదాలు-సమాలోచన అనే అంశంపై ప్రారంభమైన రెండురోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావధ అన్నారు. సరళీకతృత ఆర్థిక సంస్కరణల లాగానే మాతృభాష సరళీకతృత పదాలతో అందరికీ అర్ధమయ్యే పదాలతో, భావజాలంతో కూడిన కవిత్వం వస్తే భాష పదికాలాల పాటు బ్రతుకుతుందన్నారు. విశిష్ఠ అతిథిగా హాజరైన రాష్ట్ర రహదారుల భద్రతా విభాగం డి.ఐ.జి. సి.హెచ్. విజయారావు ఐపిఎస్ మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించటం సులువౌతుందన్నారు. మరో ముఖ్య అతిధిగా హాజరైన వాణిజ్య పన్నుల విభాగం అసిస్టంట్ కమిషనర్ డి.రాంబాబు మాట్లాడుతూ తాను తెలుగు ప్రధాన ఆప్షనల్ గా తీసుకునే పోటీ పరీక్షలో ఈ స్థాయికి చేరానన్నారు. కీలకోపన్యాసం చేసిన ప్రజ్ఞా నిధి ఆంధ్ర లయోలా విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గుమ్మా సాంబశివ రావు మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో సుమారు 40కి పైగా ప్రక్రియలు, 20కు పైగా వివిధ వాదాలు ఉన్నాయన్నారు. వివిధ రకాల వాదాలు భాషా పరిరక్షణకు, జ్ఞానాభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయో చిల్లర భావానీ దేవి, హైమవతి, ఆచార్య కొలకలూరి ఇనాక మొదలైన వారి రచనలను ఉదాహరిస్తూ ప్రసంగించారు. ప్రముఖ రచయిత్రి నైనాల వాణిశ్రీ మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవిత్వం వివిధ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళడంలో ఎంతగానో దోహదపడిందన్నారు. మొదటి రోజు సదస్సులో ఆంధ్రా , తెలంగాణా ప్రాంతాలకు చెందిన ప్రత్యక్షంగా 30మంది, ఆన్ లైనులో 30మంది ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు వివిధ ప్రక్రియలు, వాదాలు పై తమ పరిశోధనా పత్రాలు సమర్పించారు. బి.ఏ.(ఐ.ఏ.ఎస్.) విభాగ అధిపతి డాక్టర్ బి.శివనాగయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించి సదస్సు లక్ష్యాలను, నేపద్యాన్ని వివరించగా సహాయ ఆచార్యులు డాక్టర్ అద్దంకి ప్రజాపతి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్ధసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, బి.ఏ (ఐ.ఏ.ఎస్.) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య, ఉప విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అద్దంకి ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావుతదితరులు

128వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎ సి సి సి మెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 128 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎన్ సుబ్బారావు, సిహెచ్ పిచ్చయ్య, ఎస్.కె కాశీ %శీ%, ఆర్ ఇస్రాయెల్, కె హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు





మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గత ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే ఇమాంబి, వై యెహెూషువ, ఈ విశాలాంధ్ర, వై సుబ్బారావు, ఎస్.కె ఆరిఫ్, ఎండి ఇస్మాయిల్, ఈ సారమ్మ, టి నాగేశ్వరరావు, టి దుర్గ భవాని, బి అంకయ్య పాల్గొన్నారు.

పిన్నెల్లి సోదరులను అరెస్టు చేయాలి

తోట చంద్రయ్య కేసులో సిఐడి దర్యాప్తు వేగవంతం చేయాలి

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్



డిజిపి హరీష్ కుమార్ గుప్తాను కలిసిన ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై చోటు చేసుకున్న దౌర్జన్యాలు, దాడులపై సమగ్ర పోలీసు విచారణ చేసి, నిందితులను అరెస్టు చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఏపీ డిజిపి హరీష్ కుమార్ గుప్తాను మర్యాద పూర్వకం గా కలిసి విజ్ఞప్తి చేశారు. టిడిపి కార్యకర్త తోట చంద్రయ్య హత్య కేసుపై సిఐడి చేస్తున్న దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన నిందితులకు శిక్షపడేలా చేయాలని కోరారు. పిన్నెల్లి సోదర్లు గడిచిన ఐదేళ్లలో అనేక సంఘవిద్రోహ చర్యలకు పాల్పడ్డారని, వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని విన్నవించారు. మాజీ ఎమ్మెల్యే రామ కృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కుట్ర పూరితంగా డిసెంబర్ 16న మాచర్లలో గొడవలకు దిగి, టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారని, ఆస్తులను, వాహనాలను, తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని తగలబెట్టారని డిజిపి దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో రెంటాల, పాలువాయి గేటు, కండ్లకుంట, కేపీ గూడెం, కారం పూడిలో పిన్నెల్లి సోదరుల కనుసన్నల్లో జరిగిన అల్లర్ల కేసులపై సమగ్ర దర్యాప్తు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

ఆసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల :

సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్నదానం చేశారు. సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు మాట్లా డుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి గురువారం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు, గర్భిణీలకు అన్నదానం చేస్తు న్నట్లు తెలిపారు. సేవసమితి సభ్యులు పాల్గొన్నారు.

మండల సమన్వయ సమావేశం

ప్రజాశక్తి - నాదెండ్ల

వ్యవసాయ శాఖ, వెలుగు (డిర్‌డిఏ) ప్రకృతి వ్యవసాయ విభాగం వారి ఆధ్వర్యంలో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం సార్వత్రిక నవ సూత్రాలను డిపియం అమల కుమారి రైతులకు తెలియజేశారు. రైతు సాధికార సంస్థ గుంటూరు నుండి విచ్చేసిన శ్రీనివాసరావు ఏఓ, వెలుగు వారు పీఎం డేస్ కిడ్స్ తయారు చేయడానికి కావలసిన రుసుమును మహిళా సంఘాల ద్వారా రుణం రూపంలో అందించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యాలయం నుండి వచ్చిన ఉషారాణి, లక్ష్మీ, మన్విత, అడిషనల్ డిపియం ప్రేమ్‌రాజు, వెలుగు ఏపియం, సిసిలు, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావు, వివిఎలు యన్‌ఫ్‌ఎ నందకుమార్, యన్‌యఫ్‌ఎ మేరీ, యన్‌ఫ్‌ఎ అప్పలరాజు, యన్‌ఫ్‌ఎ సౌజన్య ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైట్.రెవ. చాట్ల ఐజయ్య రాజు

ఆంధ్ర ఇవాంజికల్ పశ్చిమ గుంటూరు అధ్యక్షుడిగా ఐజయ్య


ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘము, పశ్చిమ గుంటూరు, అధ్యక్షుడిగా మాచర్ల లూథరన్ చర్చి పాస్టర్, రైట్ రెవ. చాట్ల ఐజయ్య రాజును సంఘ పెద్దలు ఎన్ను కున్నారు. గురువారం స్థానిక లూథరన్ చర్చి, క్రీస్తు లూథరన్ సంఘం దేవాలయంలో జరిగిన 88వ వార్షికోత్సవ మహాసభలో ఎన్ను కున్నారు. ఐజయ్య పశ్చిమ గుంటూరు అధ్యక్షుడిగా ఐదు సంవ త్సరాలు పనిచేయనున్నారు. కార్య క్రమంలో పశ్చిమ గుంటూరు సీనడ్‌కు చెందిన అభిషక్తులు, అనాభి షక్తులు నాయకులు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీతో ప్రభుత్వం శాంతియుత చర్చలు జరపాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో చర్చలు జరిపి శాంతియుతంగా సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని పిడియం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు కోరారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి షరతులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు ముందుకు రావాలని పీస్ కమిటీ ప్రకటించిందన్నారు. గత నెల 28వ తేదీన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధి కార ప్రతినిధి అభయ్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారన్నా రు. ఈ ప్రకటన పట్ల వామపక్ష పార్టీలు, ప్రజా సంఘా లు, మేధావులు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి మావోయిస్టు పార్టీతో చర్చలు జరుపుతామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదన్నారు. భారత రాజ్యాంగం పరిధిలో ఎవరితోనైనా చర్చలు జరిపే అవకాశం ఉన్నా చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా మావోయిస్టు పార్టీతో చర్చలు జరిపి శాంతియుతంగా సమస్యలు పరిష్కారం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారతంలో నిత్యం మారణకాండకు పాల్పడటం, దేశంలో ఉన్న సైనిక బలగాలను భారత ప్రజలపై ఉపయోగించడం సరైన చర్య కాదన్నారు. ఏబీ ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు బి. అంజమ్మ,పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు, జి.రామకష్ణ చికినం చిన్న తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారం చేయాలని వినతి



సత్తెనపల్లిలో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఏలు

ప్రజాశక్తి - బెల్లంకొండ:

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కొరకు దశల వారి పోరాటంలో భాగంగా పెదకూరపాడు శాసనసభ్యులు ప్రవీణ్‌కి వినతి పత్రం గురువారం బెల్లం కొండ మండల అధ్యక్షులు సుందర్‌రావు, ప్రధాన కార్య దర్శి శీను సాహెబ్ అధ్యక్షతన వినతిపత్రం ఇచ్చారు. సుందర్ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా వీఆర్‌ఏల సమస్య ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. గ్రామరెవెన్యూ సహాయలకు ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదు. రాష్ట్రంలో మంత్రులు ముఖ్యమంత్రులు మారుతున్నా వీఆర్‌ఏల కష్టాలు, సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదు. మార్చిలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వీఆర్‌ఏల గురించి ప్రస్తావన లేదు. చదువుకున్న వీఆర్‌ఏలు ఎప్పటికైనా వీఆర్వోగా ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. నామినీలుగాగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించడం లేదు. ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలకు వయోభారం పెరుగు తుంది. దళిత గిరిజన మైనార్టీ బడుగు బలహీన వర్గాలను, వీఆర్‌ఏల కుటుంబాలను ఆకలి బాధల నుండి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. పెరిగిన ధరలకనుకూలంగా వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలని, అటెండర్ నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ల శాతాన్ని 70 శాతాన్ని పెంచాలని, అక్రమడ్యూటీలను రద్దుచేసి, అర్హులైన వీఆర్‌ఏలకు అటెండర్ నైట్‌వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బెల్లం కొండ గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి:

పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే దశల వారి పోరాటం చేస్తామని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ అన్నారు. సత్తెనపల్లి డివిజన్ ఆర్డీవో కార్యాలయ ఏవో (పరిపాలన అధికారి) సరోజకు సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్ అధ్యక్షతన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నకరికల్లు మండల అధ్యక్షులు కాసులు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మరియు సత్తెనపల్లి వీఆర్‌ఏలు దేశపతి, రాజు, వెంకటేశ్వర్లు,మురళి, అరుణ్ పాల్గొన్నారు.

జగన్ శవరాజకీయాలు మానుకోవాలి

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి

ప్రజాశక్తి - మాచర్ల

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు చీదరించుకుని, ఆయన పార్టీని 11సీట్లకి పరిమితం చేసినా జగన్ మోహన్‌రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు విమర్శించారు. ఆయన తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రజలు తనను ఎందుకు దూరం పెట్టారని ఆలోచన చేయకుండా ఇంకా శవరాజకీయాలు, బురద రాజకీయాలు చేయటం ఏమిటని ఎద్దేవా చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో రాజకీయ లబ్ది కోసం శాంతి, భద్రతలను కాపాడే పోలీసులను దూషించటాన్ని ఖండించారు. నైతిక విలువలను మరిచి మాట్లాడటం, వ్యవస్థలను బెదిరించాలని చూడటం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ఇదే పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని నీ హయాంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడి, ప్రతిపక్ష పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టలేదా అని నిలదీశారు. జగన్ తన పద్ధతులు మార్చుకోని హుందా రాజకీయాలు చేయాలని హితుపు పలికారు. సమావేశంలో గాజుల ఆంజనేయులు, కోటేశ్వరరావు, ప్రసాద్, మాజీ కౌన్సిలర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

అధికారులు, క్లాప్ మిత్రలు పారిశుధ్యంపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అర్జునరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురువారం సందర్శించారు. గ్రామాల్లో అధికారులు, క్లాప్ మిత్రలు పారిశుధ్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి క్లాప్ మిత్రాలకు ఇవ్వాలని, పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలని కోరారు. నందిగామ క్లాప్ మిత్రలతో పారిశుధ్యం అంశంపై ప్రత్యేక భేటీ నిర్వహించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ పై పలుసూచనలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణ వేరు చేయడం, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాలపై వారికి అవగాహన కల్పించారు. గ్రామంలోని ఏడు అంగన్వాడీ పాఠశాలల టీచర్‌లతో సమావేశమ య్యారు. అనంతరం సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, గ్రామాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి విజయ్ కుమార్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆళ్ళ సాంబయ్య, ఐటీసీ రిసోర్స్ పర్సన్ బొల్లయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ భావన, ఏపీఎం పివీ నారాయణ, ఈఓ పీఆర్‌ఆర్ డి.ఎ.శ్రీనివాసరెడ్డి, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సేవా సమితి ఆధ్వర్యంలో పూడుస్తున్న గుంతలు

రైల్వే గేటు పక్కన గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

పట్టణంలోని శ్రీ రామక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే గేటు ప్రక్కన ఉన్న రహదారి గుంతలను పూడ్చివేత పనులను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సేవా సమితి కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ రైలు గేటు సమీపంలో రహదారిపై ఉన్న గుంతల వలన వాహనదారులు, రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటాన్ని గుర్తించినట్లు వివరించారు. గుంతల వల్ల పలువురు ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. గుంతలు లోతుగా ఉండటం వలన వాహనదారులు తమ వాహనాలను నిదానంగా నడిపే క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతున్నట్లు తెలిపారు. సదరు పరిస్థితులను గుర్తించి గుంతలను తమ సేవా సమితి ఆధ్వర్యంలో పూడ్చివేసినట్లు వివరించారు. కార్యక్రమం లో కె వెంకటేష్, యాసిన్, బి మల్లి కార్జున, గడ్డం శశి, తనుజ్, గడ్డం శశిశేఖర్, కే రఘు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఓ రమణ కాంతారెడ్డి

ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితాలు తయారు చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో జి బిఎల్‌ఓలకు సూచించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల లయోలా ఇంజనీరింగ్ కళాశాలలోబూత్ స్థాయి అధికారుల శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. శిక్షణ ఆర్డీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి బూతుస్థాయి అధికారులు విధులు తూచ తప్పకుండా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేస్తే 90శాతం సమస్యలు రాకుండా ఉంటాయని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు. సదరు శిక్షణా తరగతులకు నియోజకవర్గంలోని సహాయ ఓటర్ల నమోదు అధికారులు, సత్తెనపల్లి చక్రవర్తి, రాజుపాలెం దుర్గేష్, ముప్పాళ్ళ భవానీ శంకర్ ఉప తహశీల్దార్లు, బూత్‌స్థాయి అదికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపి గారూ ! మిర్చి రైతులు, వరికపూడిశెల గురించి మాట్లాడండి

ఎంపి లావుకు వైసిపి నేత అన్నెం పున్నారెడ్డి సూచన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురించి కాకుండా మిర్చి ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మిర్చి రైతుల గురించి, ఇతర పంటల మద్దతు ధరలు గురించి పార్లమెంట్‌లో మాట్లాడితే బాగుంటుందని రైతు విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులపై చేసిన వాఖ్యలను కేంద్ర హోం మంత్రికి లేఖ రాసిన శ్రీ కృష్ణ దేవరాయలు రాష్ట్రంలో రైతాంగ సమస్యలు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని తెలిపారు. టిడిపి వర్గీయుల దాడిలో గాయ పడి మృతి చెందిన వైసిపి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిం చడం తమ అధినేత కనీస బాధ్యత అని గుర్తు చేశారు. ప్రాంతాల మధ్య జగన్ చిచ్చు పెడుతున్నాడని అనడం తగదని పేర్కొన్నారు. అనవసర రాద్ధాంతాలు చేస్తూ కాలయాపన చేయకుండా పల్నాడు ప్రాంత రైతులకు సాగు, తాగు నీరు గురించి, వరికపూడిశెల గురించి మాట్లాడి పల్నాడు అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు



4వ రోజు సమ్మెలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె గురువారం నాటికి నాలుగవ రోజు చేరింది. సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా నాయకులు వి వి జవహర్లాల్, ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ,ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకఅష్ణ లు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నెలకు 12,500 రూపాయలు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, అయినప్పటికీ రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. వేతనాలు చెల్లింపుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కనీసం నెలకు 24500 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 16 నెలలుగా ఈఎస్ఐ, వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ఐడి కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. ఆప్కాస్ లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె నాలుగు రోజులుగా జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని విమర్శించారు. అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్ స్పందించడం లేదని విమర్శించారు. ఇదేవిధంగా సమ్మె కొనసాగితే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుందని అన్నారు. స్వచ్ఛ మంగళగిరి పేరుతో కార్యక్రమాల్లో క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొంటున్నారని వారన్నారు.ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కలగజేసుకొని వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు డి.శివ, కార్యదర్శి ఎం. రవి, యూనియన్ నాయకులు ఎం.యోహాన్, జె శ్రీకాంత్, ఆర్.కృఅష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ నిఘానీడలో పేరేచర్ల జంక్షన్

అవుట్ పోస్ట్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన పేరేచర్ల జంక్షన్లో గురువారం గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ ఔట్ పోస్టులు ప్రత్యేకించి సిబ్బందిని ఏర్పాటు చేశారు. గుంటూరు కర్నూలు హైదరాబాదు ప్రధాన రోడ్ల జంక్షన్ కావడంతోటి అనుమానిధులు వాహన కదిలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరమైనటువంటి సిసి కెమెరా వ్యవస్థను పటిష్ట భద్రతగా ఏర్పాటు చేశారు. ప్రజలకు నిత్యం పోలీస్ సేవలు అందుబాటులో ఉండే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు సిఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్, పలువురు సిబ్బంది పాల్గన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవు తున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం మంగళగిరి పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేనేత కార్మిక సంఘం జెండాను ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, ఎ.ప్రభాకర్, ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గజవల్లి వెంకటకఅష్ణారావు, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ చేనేత సంఘం నాయకులు గంజి శ్రీనివాసరావు, బడ్డు ఉమామహేశ్వరరావు, వంగర ఉమామహేశ్వరరావు, వెనిగళ్ళ సాంబశివరావు, నందం సుబ్రహ్మణ్యం, బాపనపల్లి వెంకటేశ్వర రావు, పాలెం నాసరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో నేడు 9వ రీసెర్చ్ డే

ఉత్తమ పరిశోధకులకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అమరావతి ఎస్ఆర్ఎం యూని వర్సిటీలో శుక్రవారం 9వ రీసెర్స్ డే జరుగనుంది. ప్రొఫెసర్లు, విద్యార్థులు పరిశోధనా రంగంలో రాణించేందుకు అనువైన సహకారాన్ని అందించడం, ఉత్తమ పరిశోధకులను ప్రోత్సహించడం రీసెర్చ్ డే ప్రధాన ఉద్దేశం. ప్రతి ఆరు మాసాలకు ఒకసారి రీసెర్చ్ డే కార్యక్రమాన్ని యూనివర్సిటీ యాజమాన్యం నిర్వహిస్తోంది. శుక్రవారం జరిగే రీసెర్చ్ డే కార్యక్రమానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బెర్హంపూర్) డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్లతో పాటు డీన్ రీసెర్స్ డాక్టర్ రంజిత్ రాపా తదితరులు రీసెర్చ్ డేలో పాల్గొంటారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న చేస్తున్న మూర్తి శారద ప్రక్కీ

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం తలసేమియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అవగాహన కల్పించడం కొరకు మూర్తి శారద ప్రక్కీ విద్యార్థులకు తలసేమియా వ్యాధి, దాని లక్షణాలను నిర్ధారణ పరీక్షలను విద్యార్థులకు వివరించారు. రక్తంలో ఉండే హిమోగ్లోబిన్ శరీరంలో తగినంత ఉత్పత్తి చేయనప్పుడు ఏర్పడే రక్త వ్యాధినే తల సేమియా అంటారని తెలిపారు. రోటరీ క్లబ్ నెంబర్ స్వప్న మాట్లాడుతూ తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్త కణాలను మార్చడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడచ్చని తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు మాట్లాడుతూ తమ విద్యార్థులు రక్తదానంలో ముందుంటారని గత వారంలో చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 100కు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి శ్రీ బ్లడ్ బ్యాంక్ వారికి, తల సేమియా రోగులకు అందజేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెయిన్బో బ్లడ్ బ్యాంక్ నవీన్, కళాశాల ఏవో సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, వివిధ శాఖ అధికారులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో రోడ్లను శుభ్రం చేసిన టీడీపీ నాయకులు



రోడ్లు శుభ్రం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపులో భాగంగా ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం టిడిపి నాయకులు నిర్వహించారు. గ్రామ పరిధిలోని ఎస్సీ స్మశాన వాటిక రోడ్డు నుండి శివాలయం, నాగేంద్ర స్వామి టెంపుల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెట్లను నరికి రోడ్లను శుభ్రం చేశారు. నాలుగు ట్రాక్టర్లు, ఒక జెసిబి, 40 మంది సిబ్బందితో టిడిపి నాయకులు స్వయంగా పలుగు, పార చేత బూని ముళ్ళ కంపను తొలగించడమే కాక, చీపుర్లు పట్టుకొని రోడ్లను ఉడ్చారు. చెత్త కుప్ప లను ఎత్తి, డ్రైనేజీలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, తెలుగుదేశం సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం, జోరుగా దాసు, చావలి సురేష్, షేక్ నాగూర్ వలి, గుంపిన నాగేశ్వరరావు, పాకనాటి మధు, కొడవటి సురేష్, కత్తిక శ్రీరాములు, కంచర్ల కోటేశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న సిబార్ వైద్యులు

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరులో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక జిల్లా పరిషత్ వైద్యశాలలో ఏర్పాటుచేసిన శిబిరంలో తక్కెళ్ళపాడు కు చెందిన సిబార్ దంత వైద్యశాల బఅందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సువర్ణలత, ప్రోగ్రాం రిప్రెజెంటేటివ్ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. దంత సంబంధిత వ్యాధులకు వైద్యులు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. శిబిరంలో డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీలేఖ, సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఉచిత రక్తదాన శిబిరం



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయకు శిబిరాన్ని ప్రారంబించారు. గుంటూరు సర్వజన ఆసుపత్రి నుంచి విచ్చేసిన వైద్యులతో పాటు యూనివర్సిటీ డాక్టర్లు రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 404 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించినట్లు యూనివర్సిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ ఇన్చార్జి డైరెక్టర్ వడ్డి రమేష్, రేవతి బాలక్రిష్ణన్, గుంటూరు. జీజీహెచ్ వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ వంశీ పాల్గొన్నారు.



రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్, ఏఓ శ్రీనివాసరావు

తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ సబ్సిడీ ద్వారా 27 వేల రూపాయల విలువగల తైవాన్స్ స్పెయర్లు 10 వేల రూపాయల సబ్సిడీతో 17వేల రూపాయలకే సబ్సిడీ ద్వారా తైవాన్స్ స్పెయర్లను బుధవారం ఎంటిఎంసీ పరిధిలోని గుండి మెడ గ్రామంలో టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, ఏవో శ్రీనివాసరావు చేతుల మీదుగా ఇద్దరు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన రైతులు గుండిమెడ చిన్న పాములు, అనుమోలు వెంకయ్య టిడిపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపి గుండిమెడ గ్రామ పార్టీ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు శివరావు మృతి



ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ రంగస్థల కళాకారుడు గద్దె శివరావు(70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన ఆయన ఏకపాత్రాభినయంలో దిట్ట. అలాగే మాధవపెద్ది సత్యం, ఘంటసాల పాటల వీరాభిమాని, గాయకుడు కూడా. ఆయన మఅతికి కొలంకపురి నాటక కళా పరిషత్, కళల కాణాచి బృందం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. కళల కాణాచి సంస్థ నిర్వాహకులు బుర్ర సాయి మాధవ్ సూచనల మేరకు చెరుకుపల్లి సింగారావు, ఎస్ శరత్ వెంకయ్య తదితరులు శివరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ 5వేలు తక్షణ సాయంగా అందించారు.



మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగ కుమారికి ఘన సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మార్కెట్ యార్డు డైరెక్టర్ నియమితులైన జె. నాగకుమారిని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం గురువారం ఘనంగా సన్మానించింది. పాత మంగళగిరి చెందిన జె.నాగకుమారికి టిడిపి కూటమి ప్రభుత్వం మంగళగిరి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పదవి ఇచ్చింది. సన్మాన కార్యక్రమంలో పద్మశాలియ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అంజిబాబు, నందం నాగేశ్వరావు, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గర్భిణులకు స్కానింగ్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడికొండ

స్థానిక రూరల్ హెల్త్ సెంటర్లో గురువారం స్కానింగ్ సేవలను డిఎం హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. గర్భిణుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రీజినల్ హెల్త్ సెంటర్లో స్కానింగ్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. పిహెచ్సి, ఆర్.హెచ్సి, సబ్ సెంటర్ల నుండి డాక్టర్లు సిఫార్సు చేసిన గర్భిణీ స్త్రీలకు మాత్రమే స్కానింగ్ తీయబడుతుందని తెలిపారు. ప్రారంభో త్సవం లో డాక్టర్ నళిని దేవి, సీతారామ, రవీంద్ర, శివ బాబు పాల్గొన్నారు.

నేడు ఫార్మా-టెక్ సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

ఫార్మారంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచుకునే లక్ష్యంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ బెంగుళూర్ ఆధ్వర్యంలో నేడు స్థానిక క్యాపిటల్ హోటల్లో ఫార్మా-టెక్ సమ్మేళనం పేరుతో సెమినార్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు షంషుజ్జమాన్ అన్సారీ, డాక్టర్ సుబోధ్ ఎస్.సతీష్, సచిన్ ఎస్.భట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ జి.వీరపాండ్యన్, ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ సిఇఒ పఠాన్‌శెట్టి రవిసుభాష్, సిప్లా కంపెనీ బిజినెస్ యూనిట్ హెడ్ ఎస్.బెనర్జీ పాల్గొంటారన్నారు. ప్రస్తుతం ఫార్మాసీ రంగంలో నెలకొన్న పరిస్థితులు, భవిష్యత్‌లో ఎలాంటి మార్పులు రాబోతున్నాయి, అందుకు అనుగుణంగా విద్యార్థులు పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలు తదితర అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు.

వేపపుల్ల మింగిన వ్యక్తికి అంజిరెడ్డి హాస్పిటల్‌లో చికిత్స


ఎండోస్కోపి సర్జరీ చేసిన వైద్యులకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు ధీటుగా తమ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్య సేవలు పల్నాడు ప్రజలకు అందిస్తున్నామని దీనికి నిదర్శనంగా గురువారం విజయవంతంగా జరిగిన చికిత్స అని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం ఉదయాన్నే వేప పుల్లతో పళ్ళు తోముకుంటూ పొరపాటున వేప పుల్ల మింగిన 28 ఏళ్ల వ్యక్తి గురు వారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటా హుటిన హాస్పిటల్ కు తరలించగా తక్షణమే పరీక్షలు చేసిన వైద్యులు వేప పుల్ల మింగినట్లు గుర్తించి అందించిన అరుదైన చికిత్సకు నరసరావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వేదికగా నిలిచింది. హాస్పిటల్ అధినేత ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి తమ వైద్య బృందంతో 2 గంటలకు పైగా శ్రమించి ఎండోస్కోపీ ద్వారా ప్రేగులో ఇరుక్కున్న 26 సెంటీ మీటర్ల వేప పుల్లను బయటకు తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అస్వస్థతకు గురైన నకరికల్లు మండలం గుళ్లపల్లి గ్రామానికి చెందిన రోగి గురవయ్య కుటుంబ సభ్యులు తమను సంప్రదించా రన్నారు. ప్రాథమిక పరీక్షల అనంతరం వేపపుల్ల పేగులో ఇరుక్కుపోయినట్లు గుర్తించామన్నారు. అడ్వాన్స్ ఎండోస్కోపీ చికిత్స ద్వారా వేపపుల్ల తొలగించేందుకు కుటుంబ సభ్యుల అనుమతితో ఎండోస్కోపీ విధానంలో ప్రేగులో ఇరుక్కున్న వేపపుల్ల కడుపులో నుంచి బయటకు తీశామన్నారు. పేగులకు, అన్నవాహికకు రంధ్రాలు పడకుండా, రక్తస్రావం జరగకుండా విజయవంతంగా బయటకు తీసి యువకుడుని ప్రాణాపాయ స్థితి నుంచి కపాడామన్నారు. ప్రముఖ నగరాలలో జరిగే ఇటువంటి అరుదైన చికిత్స తమ హాస్పిటల్ విజయవంతంగా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. సహకరించిన తమ వైద్య బృందానికి డాక్టర్ శ్రీనివాస రెడ్డి అభినందించారు. ప్రాణాపాయ స్థితి నుండి బాధితుడు బయట పడడంతో రోగి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



రోగి కడుపు నుండి తొలగించిన వేప పుల్ల



ల్యాప్రోస్కోపి విధానంలో చికిత్స చేస్తున్న వైద్యులు

టిజెపిఎస్ విద్యార్థికి బెస్ట్ క్యాడెట్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజి (25వ ఆంధ్ర బెటాలియన్) ఎన్‌సిసి క్యాడెట్ గుంటుపల్లి వేంకట దినేష్‌కు ఉత్తమ క్యాడెట్ పురస్కారం లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్.కె శాస్త్రి తెలిపారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో నిర్వహించిన రాత, కవాతు, ఫైరింగ్, మౌఖిక పరీక్షల్లో దినేష్ ఉత్తమ ప్రదర్శనతో మొదటి స్థానంలో నిలిచాడన్నారు. దీంతో గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ ఉత్తమ క్యాడెట్ పురస్కారంతో పాటు, రూ.4500లు నగదు అందచేశారన్నారు. ఈ సందర్భంగా దినేష్‌కు కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, సెక్రటరీ కె.వి.బ్రహ్మం, పి.జి కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, కళాశాల ఎన్‌సిసి అధికారి మేజర్ పి. కుమార్‌రాజా అధ్యాపకులు అభినందించారు.



వేంకట దినేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



ప్రాంగణ ఎంపికలకు హాజరైన విద్యార్థులు

మలినేని ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

మల్లినేని పెరుమాళ్లు ఫార్మసీ కాలేజిలో గురువారం ఫైవ్‌కేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఏడాది మలినేని ఫార్మసీ కళాశాలలో ఎన్నో పరిశ్రమలు ప్రాంగణ ఎంపికలకు వస్తాయని, తద్వారా నూటికి నూరు శాతం విద్యార్థులు ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలియజేశారు.ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికలకు విద్యార్థులు ఉద్యోగాలు సాధించే విధంగా వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫైవ్ కేర్ సొల్యూషన్ హ్యూమన్ రిసోర్సెస్ పర్సన్స్ అశ్విని, ప్రత్యూష, జెస్సికా, డైరెక్టర్ డాక్టర్.డి.శ్రీనివాసరావు, హెచ్‌ఓడి జి.రాజేష్ పాల్గొన్నారు.

ఐకానిక్ ఫ్లైఓవర్ కోసం ఐక్యంగా ఉద్యమం

బెటర్ శంకర్ విలాస్ బ్రిడ్జి సాధన జెఎసి ఆధ్వర్యంలో మానవహారం - ట్రాఫిక్ సమస్యల తీరాలంటే ఆర్‌యుబి తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు

రాజధాని ప్రాంతంలోని గుంటూరు నగరంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా, గతంలో ప్రకటించిన విధంగా లాడ్జి సెంటర్ నుండి హిందూ కాలేజి వరకూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మించాలని, ఆర్‌యుబి కూడా ముందే నిర్మించాలని 'బెటర్ శంకర్ విలాస్ బ్రిడ్జి సాధన జెఎసి' పిలుపు మేరకు గురువారం నగరంలో భారీ మానవ హారం నిర్వహించారు. లాడ్జి సెంటర్ నుండి హిందూ కాలేజి వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దాదాపు గంటసేపు మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జికి తాము వ్యతిరేకం కాదని, కేంద్రం నుండి అనుమతుల కోసం కృషి చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృషి అభినందనీయం అన్నారు. అయితే రూ.98 కోట్ల పరిమితి విధించి ఎంత దూరం వస్తే అంత నిర్మించాలని చెప్పటం సరి కాదన్నారు. గతంలో ఎంపి గల్లా జయదేవ్ హయాంలో హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ ఆర్‌ఓబి నిర్మిస్తామని రూ.167 కోట్లు బడ్జెట్ అంచనా వేశారన్నారు. ఇప్పుడు దానికి కుదించి నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు ఎలా తీరతాయని ప్రశ్నించారు. అలాగే రెండు, మూడేళ్లపాటు సాగే బ్రిడ్జి నిర్మాణ సమయంలో ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే ముందుగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఆర్‌యుబి లేకపోతే ప్రజలు నరకం చూస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. జెఎసి నాయకులు ఎల్.ఎస్. భారవి మాట్లాడుతూ గతంలో టిడిపి మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎంపి గల్లా జయదేవ్ హయాంలో ఆర్‌యుబి, ఆర్‌ఓబి రెండూ నిర్మిస్తామని చెప్పాడు, ఇప్పుడు సాధ్యం కాదని అధికారులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఇది అభివృద్ధి వ్యతిరేక పోరాటం కాదని, అందరికీ అభివృద్ధి ఉపయోగపడాలని నిర్వహించే పోరాటం అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కేంద్రం ఇచ్చే నిధులకు అదనపు నిధులు సమకూర్చి, రాజధాని ప్రాంతంలో కీలకమైన ఈ బ్రిడ్జిని చరిత్రలో గుర్తిండిపోయేలా హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ ఫ్లైఓవర్ మాదిరిగా నిర్మించాలన్నారు. మరో జెఎసి నాయకులు మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుత డిజైన్‌లో 25 అడుగుల్లోనే సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారని, అందులో డ్రైన్ల కోసం 5 అడుగుల మేర పోతుందని, దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరవన్నారు.ఆర్‌యుబి నిర్మించటమే దానికి పరిష్కారం అన్నారు. రేట్ పేయర్స్ అసోసియేసన్ నాయకులు రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వాలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ స్కీమ్‌లో భాగంగా అదనపు నిధులు సమీకరించి భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు కె.నళినీకాంత్, అవగాహన కార్యదర్శి కె.శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల కార్యకర్తలు, విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది, షాప్‌ల ఉద్యోగులు, సాధారణ ప్రజలూ, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏసీ కాలేజి వద్ద విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమీర్, ఎం.కిరణ్‌కుమార్, నాయకులు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారంలో పాల్గొన్న ప్రజలు



ఏసీ కాలేజి వద్ద కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

వివిధ సంస్థల ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ 2024-25 విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు 786 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందడం హర్షణీయమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని తెలిపారు.ఇటీవల కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 16 మందికి ఉద్యోగాలు లభించాయని సెక్రెటరీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.



పల్నాడులోని అన్ని పిఎసిఎస్‌లు కంప్యూటరీకరణ

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ప్రభుత్వం సహకారరంగ అభివృద్ధికి రూ 2,516 కోట్ల నిధులు కేటాయించి 63 వేల పిఎసిఎస్‌లను కంప్యూటరైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె ధనుంజయ్ తెలిపారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా గురువారం నరసరావుపేట సహకార బ్యాంకులలో కంప్యూటీకరణ అంశంపై పిఎసిఎస్ సిఇఒలు, బాంక్ మేనేజర్లు, సూపర్వైజర్లు, ఆడిటర్ లకు జరిగిన జిల్లా స్థాయి సెమినార్‌లో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో అన్ని పిఎసిఎస్ లు కంప్యూటరైజేషన్ పూర్తి చేసిన సందర్భంగా సీఈవోలను, బ్యాంక్ సిబ్బందిని, ఆడిటర్‌లను అభినందించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో (పిఎసిఎస్) ఆధునిక సాఫ్ట్‌వేర్ - హార్డ్‌వేర్ సమకూర్చి కంప్యూటరైజేషన్ చేయడం సాంకేతిక మార్పు మాత్రమే కాదని గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవాత్మకమైన పురోగతి అన్నారు. దేశంలో గ్రామీణ రైతుల ఆర్థిక జీవన విధానానికి బలమైన మద్దతుగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించే విధంగా పనిచేస్తున్నాయన్నారు. కంప్యూటరైజేషన్ వల్ల ప్రతి లావాదేవీ డిజిటల్ రికార్డ్‌గా ఉండటంతో అవినీతి అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. రుణాల మంజూరు, తిరిగి చెల్లింపు, విత్తనాల పంపిణీ వంటి సేవలు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. రైతుల వివరాలు ఖాతాల సమాచారం, నిధుల వినియోగం వంటి విషయాలు సులభంగా తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి ఇదొక ముఖ్యమైన దశన్నారు. సిబ్బంది కి కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం, నెట్‌వర్కింగ్ ద్వారా రాష్ట్ర మరియు జాతీయ బ్యాంకులతో అనుసంధానం కల్పించడం జరుగుతాయని పేర్కొన్నారు. కంప్యూటరీకరణ వలన రైతులకు తక్కువ సమయంలో సేవలు అందుబాటులోకి రావడం, సిబ్బంది విధి నిర్వహణలో సమర్థత పెరగడం, అన్ని పిఎసిఎస్ లను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సమగ్ర డేటా లభ్యత పెరుగుతుందని చెప్పారు. కంప్యూటకరణ వలన వచ్చే సమస్యలు, సవాళ్లు, సిబ్బంది వద్ద సాంకేతిక పరిజ్ఞాన లోపం, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి సమస్యలను అధిగమించాల్సి ఉందని చెప్పారు. కంప్యూటకరణ అనేది ఖర్చు కాదు, ఒక పెట్టుబడి అని అన్నారు. రైతుల సంక్షేమం గ్రామీణ అభివృద్ధి కోసం, ఒక సుస్థిర వ్యవసాయ వ్యవస్థ కోసం వేసే దారిని సుళువుగా చేస్తుందని జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణ అన్నారు. ప్రతి పిఎసిఎస్ ఒక డిజిటల్ మోడల్‌గా మార్చి "డిజిటల్ ఇండియాను "డిజిటల్ గ్రామీణ భారత్"గా విస్తరించాలన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్